ప్రయాణం.. నరకం

- ఐదేళ్లకే దెబ్బతిన్న కన్నపూర్–అష్టా రోడ్డు
- తారు లేచి గుంతలు పడిన వైనం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



కన్నపూర్ సమీపంలో దెబ్బతిన్న తారు రోడ్డు



గుంత ఏర్పడటంతో అధ్వానంగా తారు రోడ్డు

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు భారీవర్షాలు, కేజీవీల్స్ ట్రాక్టర్ల కారణంగా దెబ్బతిన్నాయి. దీంతో రోడ్లపై తారు లేచి గుంతల మయంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేయించాలని వేడుకుంటున్నారు.

రూ.కోటిన్నరతో రోడ్డు..

లోకేశ్వరం మండలంలోని కన్నపూర్ నుంచి అష్టా గ్రామం వరకు 3.4 కిలోమీటర్ల మేర 2017–18లో ఎస్‌డీఎస్ నిధులు రూ.కోటిన్నరతో తారు రోడ్డు నిర్మించారు.

కానీ సదరు రోడ్డు భారీ వర్షాలకు కేజీవీల్స్ ట్రాక్టర్లు వెళ్లడంతో అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడినా.. కంకర తేలినా మరమ్మతులు చేపట్టడం లేదు. వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు కరువు..

ఈరోడ్డుపై నిత్యం వందలాది మంది ప్రయాణికులు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలకు ఏర్పడిన గుంతలు కన్పించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. బోదకులు ఓ గుంతను తప్పించే యత్నంలో మరో గుంతలో పడుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నామని వాపోతున్నారు.

వెళ్లాలంటే భయమేస్తుంది..



కన్నపూర్– అష్టా వరకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే భయమేస్తోంది. రాత్రి అయితే పరిస్థితి దా రుణంగా ఉంటుంది. అధికారులు మరమ్మతులు చేపట్టాలి. – మురళి, కన్నపూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని కన్నపూర్–అష్టా రోడ్డుపై గుంతలు ఏర్పడిన మాట వాస్తవమే. ఈవిషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకుంటాం. – రఘువంశీ, పీఆర్ జేఈ, లోకేశ్వరం

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



మామడ: వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

మామడ: గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేయడంతోపాటు సర్పంచ్‌ల పదవికాలం ఆరునెలలు పొడిగించాలని మండలంలోని సర్పంచులు బుధవారం ఎంపీడీఓ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు తెచ్చి పనులు చేస్తే ఇప్పటికీ బిల్లులు మంజూరు చేయలేదని వాపోయారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు భూమేశ్వర్, హన్మాగౌడ్, గంగాధర్, కిష్యానాయక్, ముత్యంరెడ్డి, సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

భైంసారూరల్: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని కోరుతూ బుధవారం పలువురు సర్పంచులు ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసిన ఏడు నెలలకు చెక్‌పవర్ ఇచ్చారన్నారు. కరోనా కాలంలో రావాల్సిన నిధుల్లో కోత విధించారని పేర్కొన్నారు. పల్లెప్రగతి బిల్లులు, 16నెలలుగా ఎస్‌ఎఫ్‌సీ నిధులు విడుదల చేయలేదని వాపోయారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాజు, వినోద్, మారుతి తదితరులు ఉన్నారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

భైంసాటౌన్: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు తమ డిమాండ్లను వివరించారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ బకాయిలు చెల్లించేలా చూడాలని కోరారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరితే ఉచితంగా చికిత్స పొందేలా చూడాలని విన్నవించారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ దామోదర్‌రెడ్డి, ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు నాగనాథ్, కార్యదర్శి ఎస్.భాస్కర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు మాణిక్‌రావు, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, నారాయణ్ సభ్యులు ఉన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు



ఇటుకబట్టీ వద్ద మాట్లాడుతున్న అధికారులు

ఖానాపూర్: 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల పరిరక్షణాధికారి దేవిమురళి హెచ్చరించారు. పదో విడత ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని సాయినగర్, తిమ్మాపూర్, మండలంలోని ఎక్బాల్‌పూర్, మస్కాపూర్ గ్రామ శివార్లలోని ఇటుక బట్టీలు, సిమెంట్ బ్రిక్స్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బాలకార్మిక చట్టాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. 15 నుంచి 18 ఏళ్ల పూర్తికాని పిల్లలను ప్రమాదకర పనిలో పెట్టవద్దని సూచించారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. నిర్మల్ డివిజన్ ఆపరేషన్ స్మైల్ టీం ఇన్‌చార్జి ఎస్సై అశోక్, సిబ్బంది చిన్నయ్య, షౌకత్, నరేశ్, వజ్రమ్మ, గంగాధర్, సుప్రియ, నవీన్, తదితరులున్నారు.

'ప్రభుత్వ సొమ్ము కాజేస్తున్న వారిని అడ్డుకోవాలి'

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ పరిధిలో చేయని పనులు చేసినట్లు ఎంబీలను సృష్టించి ప్రభుత్వ సొమ్మును కాజేసేందుకు యత్నిస్తున్న వారిని అడ్డుకోవాలని బుధవారం కాంగ్రెస్ నాయకులు గాదె సంతోష్, అజీమ్ ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డికి ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ కింద మొక్కలు కాపాడేందుకు ప్రహరీగా పెట్టిన ఇనుప కంచెకు ఎక్కువ ఎంబీలను రికార్డు చేయించి ప్రభుత్వ సొమ్మును కాజేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు సమగ్ర నివేదిక అందించే వరకు పంచాయతీ చెక్కులు జారీ చేయవద్దని కోరారు.

సంక్షిప్త వార్తలు

అభివృద్ధి పనులపై సమీక్ష

పెంబి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామాల్లోని అభివృద్ధి పనులపై ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పల్లెప్రగతి ఆన్‌లైన్ ప్రక్రియ, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడుగుంతలు తదితర అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని సూచించారు. కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ పదవి హర్షణీయం

భైంసాటౌన్: విద్యార్థి సంఘ నాయకుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజద్ షేక్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న వెంకట్ సేవలను పార్టీ గుర్తించిందని పేర్కొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు మళ్లీ తీసుకోవాలి

పెంబి: కొందరు గిరిజనులు ఆసుపత్రి, ఇతర ప్రాంతాల్లో ఉండటంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేకపోయారని.. వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ శ్రావణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

ఎంపీపీకి సన్మానం

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అబ్దుల్ రజాక్‌ను పలువురు నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వంగ మహేందర్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కడెం: మండలంలోని ధర్మాజీపేట్‌కు చెందిన మూల సౌజన్య రోడ్డు ప్రమాదంలో గాయపడింది. బుధవారం బాధితురాలిని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే బొజ్జు దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ అధ్యక్షుడు గొళ్ల వెంకటేశ్, యాదగిరి, జగన్‌రెడ్డి ఉన్నారు.

బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా మున్సిపల్ బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఇన్వర్డ్, రెవెన్యూ, బర్త్ అండ్ డెత్, పలు విభాగాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సివిఎస్ రాజును పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని.. అటెండెన్స్‌కు రిజిస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికులకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. మున్సిపల్‌లో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ఈనెలలో జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎస్ రాజు వారిని సన్మానించి పూల మొక్క అందించారు. ఇందులో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందవద్దు

కుంటాల: యూరియా కోసం ఆందోళన చెందవద్దని మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉందని ఏ వో సోమలింగారెడ్డి తెలిపారు. బుధవారం పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు యూరియా బస్తాలు అందించారు. సీఈఓ నాగభూషణం, ఏఈవో శ్రీధర్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భోజేందర్, కృష్ణ ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాగు ధర రూ.270 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఈరోజు

మామడలో 2కే రన్

మామడ: ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు మండల కేంద్రంలో గురువారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమవతుందని.. యువకులు, బీఎల్‌వోలు రావాలని కోరారు.

చెక్కులు పంపిణీ

భైంసాటౌన్/కుంటాల/తానూరు: ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామారావుపటేల్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని భైంసా తహసీల్దార్ ప్రవీణ్, కుంటాల తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, తానూరు తహసీల్దార్ లింగమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంకుడుగుంతల నిర్మాణానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



రంజనిలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ఏపీవో, సిబ్బంది

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకుడుగుంతలను అసంపూర్తిగా నిర్మించారని.. బిల్లులు చెల్లించలేదని ఈనెల 14న సాక్షిలో ఇంకుడు గుంతలకు బిల్లులేవి? అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గ్రామాల్లో పర్యటించి అసంపూర్తి ఇంకుడుగంతల నిర్మాణాలు పూర్తి చేయించారు. సత్వరం బిల్లులు అందేలా చూస్తామని ఈజీఎస్ ఏపీవో హరిదాస్ లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

ఆదరణను చూసే కాంగ్రెస్‌లో చేరిక



మాట్లాడుతున్న నారాయణ్‌రావుపటేల్

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసే కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు పెరుగుతున్నాయని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావుపటేల్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో బుధవారం కుభీర్, తానూరు మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, తాజా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తానూర్ మండలానికి చెందిన పి.మంజులసురేశ్, చంద్రకాంత్, కె.పద్మాబాయి, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌రావు, భోజబాయి, సోనాబాయి, రోహిదాస్, కుభీర్ మండలానికి చెందిన జి.రమేశ్, సాహెబ్‌రావు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆనంద్‌రావుపటేల్, శంకర్ చంద్రే, రాంచందర్‌రెడ్డి, గజానంద్, లతీఫ్ తదితరులు ఉన్నారు.

ఎరుకల కులస్తులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

లోకేశ్వరం: ఎరుకల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం సభ్యులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎరుకల సంఘం మండలాధ్యక్షుడు కూతడి సురేశ్ మాట్లాడుతూ ఎరుకల సంఘం(కుర్రు) భవనం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించి భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులకు ఎస్టీ రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కుర్రు సంఘం మండల ఉపాధ్యక్షుడు కూతడి గంగారాం, కోశాధికారి కూతడి నవీన్ తదితరులు ఉన్నారు.

అటవీ సంపదను కాపాడుకోవాలి



పుల్గంపాండ్రిలో మాట్లాడుతున్న అధికారులు

పెంబి: అడవిలో ఉన్న జంతువులను, చెట్లను కాపాడుకోవాలని పెంబి డీఆర్వో ప్రతాప్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కోసగుట్ట, తాటిగూడ, పుల్గంపాండ్రి, రాగిదుబ్బ గ్రామాల్లో అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో నిప్పు పెట్టినా, జంతువులను వేటాడిన కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఇందులో సర్పంచ్‌లు, పెంబి రేంజ్ సిబ్బంది ఉన్నారు.

21న దివ్యాంగుల సమావేశానికి తరలిరావాలి

ఖానాపూర్: ప్రభుత్వం దివ్యాంగుడి కుటుంబానికి 35 కిలోల బియ్యం ఇచ్చి దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా గౌరవ అధ్యక్షుడు తొడసం శంభు అన్నారు. బుధవారం మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగే దివ్యాంగుల జాతీయ వేదిక జిల్లా సమావేశం జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివయ్యతో పాటు పలువురు ముఖ్యులు హాజరవుతారని.. దివ్యాంగులు తరలిరావాలని పేర్కొన్నారు. రాజేందర్, పద్మ, అశోక్, నాగమణి, గంగన్న, రాజన్న, నర్సవ్వ, సునీత, వెంకటేశ్, గంగవ్వ, నరేశ్, తదితరులున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అతి పురాతన దేవరకోట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను ఈవో రంగు రవికిషన్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. రూ.3,18,053 నగదు వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆలయానికి డిసెంబర్ 17నుంచి జనవరి 13వ తేదీ వరకు జరిగిన ధనుర్మాస ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారని పేర్కొన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యనిర్వహణ పరిశీలకుడు భూమన్న, సభ్యులు దేవేందర్‌గౌడ్, గంగాధర్, శ్రీనివాస్, అనిల్ తదితరులున్నారు.

పసుపు రైతులకు అవగాహన

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో బుధవారం రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో పసుపు రైతులకు అవగాహన కల్పించారు. కమ్మర్‌పెల్లి పసుపు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రాజేంద్ర సొనారి, శైలం వెరైటీ కొత్తరకాలపై గతంలో పసుపు మొక్కలు అందజేసిన రైతుల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు లోకల్ విత్తనాలతోపాటు వ్యవసాయ సాంకేతిక పద్ధతుల్లో తేడాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్, సభ్యులు, రైతులు చిన్నయ్య, రామారావు, రాజేందర్, రాందాస్, అంజవ్వ తదితరులున్నారు.

దుండగులను శిక్షించాలి

భైంసాటౌన్: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్వాన్ కాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని జయశంకర్ సొసైటీ భైంసా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని.. పోలీసులు నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. బెజ్జంకి రవీంద్రచారి, శ్రీనివాస్, ప్రకాశ్, సాగర్, లింగంచారి ఉన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

నిర్మల్‌టౌన్: వేములవాడ రాజరాజేశ్వర స్వామి మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్ర 11వ వార్షికోత్సవ వేడుకలకు హాజరు కావాలని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్‌కు మున్నూరు కాపు సంఘం సత్ర రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్ బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అన్నదాన సత్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ మున్నూరుకాపు మిత్రమండలి అధ్యక్షుడు రమేశ్, యువజన సంఘం అధ్యక్షుడు గంట రాకేశ్, నరేందర్, కాశీనాథ్, సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

సైబర్ మోసాల బారిన పడొద్దు

తానూరు: అపరిచితుల నుంచి ఫోన్‌కు వచ్చే లింకులు ఓపెన్ చేసి సైబర్ మోసాల బారిన పడొద్దని ఎస్సై సందీప్ అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం గ్రామంలో యువకులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులు ఫోన్‌కు వచ్చే ఓటీపీలు అడగరని.. అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెడుకు దూరంగా ఉండాలి

కుంటాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. మండలంలోని కల్లూర్‌లో కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో బుధవారం వారికి, వారి తల్లిదండ్రులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. గంజాయితో కలిగే అనర్థాలను వివరించారు. ఏఎస్సైలు దేవ్‌రావ్, రాందాస్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



వాహనదారుడితో మాట్లాడుతున్న ఎస్సై

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ చౌరస్తా వద్ద బుధవారం పట్టణ సీఐ పురుషోత్తం ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేశారు. నంబర్‌ప్లేట్, రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై వాహనాలు నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. పట్టణ ఎస్సై సుమలత, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

లక్ష్మణచాంద: ఓటు ప్రాథమిక హక్కని.. 18 ఏళ్లు నిండినవారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్‌లో అధికారులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



ఏఎస్పీకి మొక్క అందిస్తున్న రాజారెడ్డి

భైంసాటౌన్: పట్టణ నూతన సీఐగా డి.రాజారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం భైంసాకు చే రుకున్న ఆయన బదిలీపై వెళ్లే సీఐ ఎల్. శ్రీను నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. నూతన సీఐకి ఏఎస్పీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

భైంసాటౌన్: సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యాన్ని గడువులోగా మిల్లింగ్ పూర్తి చేసి ఎఫ్‌సీఐకి అప్పగించాలని తహసీల్దార్ ప్రవీణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సచిన్ రైస్‌మిల్‌తోపాటు మండలంలోని నీలకంఠ, ఆదిత్య, రాజరాజేశ్వర ఆగ్రో రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. కేటాయించిన ధాన్యం, అప్పగించిన బియ్యం, అప్పగించాల్సిన బియ్యం తదితర వివరాలు పరిశీలించారు. ఆయా మిల్లుల్లో ఇప్పటివరకు సగం మాత్రమే సీఎంఆర్ పూర్తయినట్లు తెలిపారు. ప్రక్రియ వేగవంతం చేసి ఈనెల 31లోగా వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీటీ శేఖర్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ వాగు నుంచి అక్రమంగా కల్లూర్ వైపు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ అహ్మద్ ఎజాజ్ ఖాన్‌కు అప్పజెప్పినట్లు వెల్లడించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నియామకం



గోవింద నాయక్

నిర్మల్‌రూరల్: తెలంగాణ ఉపాధ్యాయ సంఘం గిరిజన విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లాకు చెందిన భూక్య గోవింద నాయక్‌ను రాష్ట్ర నాయకత్వం నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎస్.భూమన్న యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. వారిని పలువురు అభినందించారు.